సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 29 । జూలై । 2023

వెండి చీరలో దర్శనం



బోట్‌క్లబ్(కాకినాడ): అధిక శ్రావణమాసం సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారు శుక్రవారం వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కులు వదిలారు.

రండి బాబూ రండి..



ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ సాగుతోంది. వచ్చే నెల 3వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లకు షెడ్యూల్ ఇచ్చారు. -IIలో▸

న్యూస్‌రీల్

జేసీగా శ్రీవాస్ నపూర్



శ్రీవాస్ నపూర్ అజయ్‌కుమార్

సాక్షి, అమలాపురం: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా శ్రీవాస్ నపూర్ అజయ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె సీసీఎల్ఏలో జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నారు. గతంలో ఆమె ఎన్టీఆర్ జిల్లా జేసీగా పని చేశారు. కోనసీమ జిల్లా ఏర్పడిన తరువాత తొలి జేసీగా ధ్యానచంద్ర హెచ్ఎం నియమితులైన విషయం తెలిసిందే. ఈ నెలలో ఆయనకు బదిలీ అయ్యింది. ఇక్కడి నుంచి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్టు చేసి, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. తాజా బదిలీల్లో ధ్యానచంద్రకు గ్రామ/వార్డు సచివాలయాల అడిషనల్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు



డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వ ఉత్తర్వులను అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తూ రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న రెండు, చివరి సంవత్సరాల విద్యార్థులను అటు మండపేట, ఇటు రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సర్దుబాటు చేయాలని సూచించారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి శుక్రవారం ఉదయం భట్నవిల్లిలోని తన నివాసంలో అందజేశారు. మంత్రికి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి, అధ్యాపకుడు డాక్టర్ బాలాస్వామి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను స్థానిక కాలేజీ రోడ్డులో (216 జాతీయ రహదారి) బీకన్న హోటల్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు భవనం పై అంతస్తు అద్దెకు తీసుకుని ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపాల్ నరసింహస్వామి చెప్పారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన సామగ్రిని తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అడ్మిషన్లు పూర్తి చేసి వచ్చే నెలాఖరు కల్లా డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.

మొక్కలతో మానవాళి మనుగడ

అమలాపురం రూరల్: మానవాళి మనుగడకు మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి వన్నెచింతలపూడి జెడ్పీ హైస్కూలులో ఆయన శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో మొక్కలు నాటి, సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పలుచోట్ల ఈ ఒక్కరోజే 6,110 మొక్కలు నాటామని తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్, ఏపీడీ బి.చంద్రమోహన్, ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ నక్కా రాజరత్న నాగమణి, పీఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లి ప్రయాణం వాయిదా వేసుకోండి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ గ్రంధి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గోదావరి వరద ఉధృతితో ఆలయానికి వచ్చే రహదారులు జలదిగ్బంధంలో ఉన్నాయని తెలిపారు. వరద తగ్గేంత వరకూ భక్తులు సహకరించాలని కోరారు.

31న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావచ్చని లచ్చారావు సూచించారు.



అల్లవరం: బోడసకుర్రు మత్స్యకార కాలనీని పరిశీలిస్తున్న మంత్రి పినిపె విశ్వరూప్



ముమ్మిడివరం: గురజాపులంకలో వరద బాధితులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా పరామర్శ



రావులపాలెం: ఊబలంక లంక పొలాల్లో నీట మునిగిన మిరప, అరటి తోటలు



మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వే మీదుగా ట్రాక్టర్‌పై రాకపోకలు

జలఖడ్గం

- పోటెత్తిన గోదావరి
- లంకల్లో పెరిగిన ముంపు
- నీట మునిగిన కాజ్‌వేలు
- ఇళ్ల చుట్టూ నీళ్లు
- వరద ఉధృతిపై సీఎం జగన్ ఆరా
- సహాయక చర్యలకు రూ.3 కోట్లు
- ఏటిగట్ల రక్షణకు ప్రతి అర కిలోమీటరుకు ఒక వలంటీరు

సాక్షి, అమలాపురం: గోదావరి మరింత ఉగ్రరూపం దాల్చింది. లంక గ్రామాలను వరద చుట్టుముడుతోంది. తీరానికి ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లను, రోడ్లను ముంచెత్తుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ పెరుగుతూ 13,63,243 క్యూసెక్కులకు చేరిన గోదావరి వరద తరువాత నెమ్మది నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. అయితే ఇక్కడ ఉదయం వరకూ పెరిగిన వరద ప్రభావంతో జిల్లాలో రాత్రి ముంపు పెరుగుతూనే ఉంది. రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి మట్టం 13.90 అడుగులుగా ఉంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గుతోందని అధికారులు తెలిపారు. జిల్లాలో వరద నియంత్రణ, సహాయ, పునరావాస చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది.

- పి.గన్నవరం మండలంలో మరిన్ని లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ఇప్పటికే 4 లంకలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా, కొత్తగా కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, నాగుల్లంక శివారు గుడ్డాయి లంక ముంపులో చిక్కుకున్నాయి. ప్రయాణికులను రేవు దాటించే చోట ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రక్షణ చర్యలు చేపట్టాయి. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయలంక, పుచ్చల్లంకల వద్ద వరద ఉధృతి మరింతగా ఉంది. జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక వాసులు రెండు చోట్ల పడవలు మారి రాకపోకలు సాగిస్తున్నారు. పి.గన్నవరం పాత అక్విడెక్ట్‌పై రాకపోకలను నిలిపివేశారు.
- అయినవిల్లి మండలం ఎదురుబిడిం కాజ్‌వేపై ముంపు తీవ్రత పెరిగింది. ప్రజలను పడవలపై దాటిస్తున్నారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కె.పెదలంక, కొండుకుదురులంక, పొట్టిలంక; అంబాజీపేట మండలం వాకలగరువు రజకపేట, నందంపూడిలోని వెన్నపువారి కాలనీ, బొంతువారిపేటల్లో నీరు చేరింది.
- మామిడికుదురు మండలం పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం వాసులు అప్పనపల్లి కాజ్‌వేపై ట్రాక్టర్‌పై రాకపోకలు సాగిస్తున్నారు.
- మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో దిండి, రామరాజులంక, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లంకల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామరాజులంక బాడవ వద్ద ఇళ్లు నీట మునిగాయి. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- ఆత్రేయపురం మండలం తాడిపూడి, వసంతవాడ, కట్టుంగ గ్రామాల లంక భూముల్లోని అరటి, పసుపు, కూరగాయ పంటల్లోకి వరద నీరు చేరింది. ఆలమూరు మండలం మూలస్థానం శివారు తోకలంకకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జొన్నాడ లంక శివారులో నీరు చేరింది.
- కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, పల్లపులంక వాసులకు కొత్తపేట మండలం వానపల్లిలో, నారాయణలంక వాసులకు కొత్తపేట మండలం వాడపాలెంలో, కేదార్లంక, వీధివారిలంక వాసులకు కొత్తపేటలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- కె.గంగవరం మండలం కోటిపల్లి రేవులో మెట్ల మీదకు వరద నీరు చేరింది. మత్స్యకార కాలనీని ఆనుకుని వరద ప్రవహిస్తోంది.
- కాట్రేనికోన మండలం నడవపల్లి, పల్లంకుర్రు రేవు, ఐ.పోలవరం మండలం పొగాకులంక, పల్లిగూడెం, ముమ్మిడివరం మండలం గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక మత్స్యకార కాలనీ, చింతావానిరేవు, చింతపల్లిలంకల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది.
- అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో 50 వరకూ ఇళ్లు నీట మునిగాయి. స్థానికుల అవసరాల కోసం పడవలు ఏర్పాటు చేశారు.



పి.గన్నవరం: వై.కొత్తపల్లిలో ముంపులో చిక్కిన ఇంటి అరుగుపై భోజనాలు చేస్తున్న కుటుంబం



పి.గన్నవరం: బూరుగులంకలో వరద నీటిలో మోటారు సైకిళ్లను మోసుకు వస్తున్న ప్రజలు

పరిశీలించిన మంత్రులు, అధికారులు

వరద ప్రభావిత ప్రాంతాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ముక్తేశ్వరం ఎదురుబిడిం కాజ్‌వే వద్ద వరద తీవ్రతను జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పరిశీలించారు. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో వరద ముంపును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆర్డీఓ బి.వసంతరాయుడు పరిశీలించారు. ముమ్మిడివరం మండలం గురజాపులంకలో వరద పరిస్థితిని కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద సహాయ, పునరావాసం, ఏటిగట్ల రక్షణకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాడేపల్లి నుంచి ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఏటిగట్ల పరిరక్షణకు ప్రతి అర కిలోమీటరుకు ఒకరు చొప్పున 740 మంది వలంటీర్లను నియమించామన్నారు. జిల్లాలో 42 చోట్ల గోదావరి ఏటిగట్లు బలహీనంగా ఉన్నట్టు గుర్తించి పటిష్టపరిచామన్నారు. బాధితులకు భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 65 బోటింగ్ పాయింట్లను గుర్తించామని, ప్రస్తుతానికి 250 బోట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు.

మూడు రకాల బృందాలతో సహాయక చర్యలు

గోదావరి వరద బాధితులను ఆదుకునేందుకు ఆయా గ్రామాల్లో జిల్లా యంత్రాంగం మూడు రకాల బృందాలను ఏర్పాటు చేసింది. బాధితుల తరలింపునకు ఒకరు, పునరావాస కేంద్రాల వద్ద ఏర్పాట్ల పర్యవేక్షణకు రెండో బృందం, పాడి పశువుల తరలింపునకు మూడో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇవి డీపీఓ వి.కృష్ణవేణి ఆధ్వర్యాన పని చేస్తున్నాయి.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద నీటి విడుదల (క్యూసెక్కులలో)

సమయం	నీటి విడుదల
ఉదయం 6.00	13,57,790
7.00	13,57,790
8.00	13,63,243
10.00	13,48,876
11.00	13,34,553
మధ్యాహ్నం 12.00	13,34,553
1.00	13,34,553
3.00	13,29,133
సాయంత్రం 4.00	13,14,870
5.00	13,14,870
6.00	13,00,652
రాత్రి 7.00	13,00,652
8.00	13,00,652
11.00	13,00,652

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ ఆదేశం
- రాజోలు నియోజకవర్గంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్. చిత్రంలో మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం రూరల్: కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు దక్కించుకుని, సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని జలవనరుల శాఖ ఇంజినీర్లను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. ఆ పనులను స్థానిక రైతులకు రూ.5 లక్షల చొప్పున నామినేషన్ పద్ధతిపై అప్పగించి, సాగుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన రాజోలు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుకు ఇబ్బంది లేకుండా డ్రెయిన్లలో పూడిక తీయించాలని ఆ శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. నియోజవర్గంలో గృహ నిర్మాణాలను డిసెంబర్ 31వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో జరగాల్సిన పనులను దశల వారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రాధాన్య క్రమంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. నిలిచిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఒకపక్క అభివృద్ధి పనులు, మరోపక్క గడప గడపకూ మన ప్రభుత్వం పేరిట సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ఇస్తున్న నిధులతో గ్రామాల్లో చిన్నతరహా అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని వివరించారు. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. ఇటువంటి సమీక్షలతో సమస్యలు పరిష్కారమై, నియోజవర్గ అభివృద్ధికి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. వివిధ కార్యక్రమాల అమలులో చిన్నచిన్న లోపాలుంటే సరి చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్య సాధనకు అధికార యంత్రాంగం పాటుపడాలని మంత్రి రమేష్ కోరారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ, వరదలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తున్నారని చెప్పారు. వరద హెచ్చరికలకు అనుగుణంగా లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. లంక గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో పాము కాటుకు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచామన్నారు. వలంటీర్ల సమన్వయంతో లంక గ్రామాల ప్రజలు వరదల నుంచి సురక్షితంగా బయటపడాలని కోరారు. సమీక్షలో ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు (రాజోలు), కొండేటి చిట్టిబాబు (పి.గన్నవరం), కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ వసంతరాయుడు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో సగం మహిళలకే

- ఆవిధంగా చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం మనదే..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్
- ఘనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి విశ్వరూప్, జోగి రమేష్ తదితరులు

అమలాపురం రూరల్: నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలనే నియమించేందుకు చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ అన్నారు. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బండారులంకకు చెందిన దంగేటి డోలామణి రుద్ర, వైస్ చైర్‌పర్సన్‌గా బడుగు మేరీ కుమారి, 20 మంది డైరెక్టర్లు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వీరితో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 210 మార్కెట్ యార్డులు ఉన్నాయని, వీటితో పాటు దేవదాయ, ధర్మదాయ, సహకార రంగాల్లో 50 శాతం అధ్యక్ష పదవులను ప్రభుత్వం మహిళలకే ఇచ్చి, వారికి రాజకీయ గుర్తింపు ఇచ్చిందని గుర్తు చేశారు. నూతన చైర్‌పర్సన్ డోలామణి, కార్యవర్గం రైతు సంక్షేమమే పరమావధిగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, రైతు, మహిళా పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, అందరి మన్ననలూ పొందుతున్నారని అన్నారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చారని చెప్పారు. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ, నూతన కార్యవర్గం ద్వారా స్థానికంగా కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో చేయూతనందించాలని అన్నారు. నూతన కార్యవర్గానికి పి.గన్నవరం కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెడ్డం సంపదరావు, కొనుకు గౌతమి, గన్నవరం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు సంసాని నాని, బొంతు గోవిందశెట్టి, బద్రి బాబ్జీ, కొనుకు బాబూజీ, డాక్టర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ), వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు మీద బిల్లు.. ఖజానాకు చిల్లు

- ఇంజినీర్లు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు
- అమలాపురం మున్సిపాలిటీలో అక్రమాలు
- కౌన్సిల్‌లో వెలుగులోకి తెచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- డీఈతో విచారణకు కమిషనర్ చర్యలు



అమలాపురం పట్టణంలోని కలశం సెంటర్

అమలాపురం టౌన్: చేసిన పనినే మళ్లీ చేసినట్లు రికార్డు సృష్టించారు.. దానికి తిరిగి బిల్లులు చేసేసుకున్నారు.. ఎవ్వరికీ తెలియదనుకుంటూ దర్జాగా ప్రజాధనం బొక్కేశారు. అమలాపురం మున్సిపాలిటీలో గత ఏడాది బిల్లు మీద బిల్లు చెల్లించిన కొన్ని పనులను గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాలక వైఎస్సార్ సీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు ఆధారాలతో సహా బయట పెట్టారు. ఈ అక్రమాలపై సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు.. అధికారులను నిగ్గదీసి ప్రశ్నించారు. కొంతమంది అవినీతి అధికారుల తీరుతో కౌన్సిల్‌కు చెడ్డ పేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం పట్టణాభివృద్ధికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఎన్నో నిధులు తీసుకు వస్తున్నారు. ఈ పనులను పారదర్శకంగా నిర్వహించేందుకు కౌన్సిల్‌లోని పాలక పక్షం కృషి చేస్తూంటే.. కొందరు ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై మున్సిపాలిటీకి వస్తున్న వివిధ గ్రాంట్లతో పాటు సాధారణ నిధులను ఇలా స్వాహా చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయం నుంచి ఈ ఏడాది మే నెల వరకూ చేసిన పనులకు లేదా అజెండాలో చేర్చిన కొన్ని పనులకు కౌన్సిల్ ఆమోదం పొంది.. ఆనక బిల్లులు రికార్డు చేయడం వంటి అక్రమాల ద్వారా దాదాపు రూ.కోటి వరకూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఓ కాంట్రాక్టర్ పట్ల ఇంజినీరింగ్ అధికారులు అత్యంత ప్రేమ చూపించి ఈ అక్రమాలకు పాల్పడ్డారని పాలక పక్షం చూపుతున్న ఆధారాలతో స్పష్టమవుతోంది.

ఇవిగో ఉదాహరణలు

- గత ఏడాది ఆగస్టు 22న ఎర్ర వంతెన రోడ్డు (216 జాతీయ రహదారి చెంత) గమని వెంకట రమణ ఇంటి నుంచి చేట్ల కొండమ్మ ఇంటి వరకూ తాగునీటి పైపు పనులకు రూ.5 లక్షలకు బిల్లు చేసి, ఆ మేరకు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. మళ్లీ అదే పనిని గమని వెంకట రమణ ఇంటి నుంచి చేసినట్టు చూపుతూ అదే తేదీన మరో రూ.5 లక్షలకు బిల్లు పెట్టారు. వాస్తవానికి గతంలో తాగునీటి పైపులైన్ల నిమిత్తం రూ.5 లక్షల చొప్పున నాలుగు పనులను మొత్తం రూ.20 లక్షలతో పూర్తి చేశారు.
- 2021 జూన్ నెలలో కిమ్స్ కళాశాల ప్రాంతంలో సైఫన్, అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడికల తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులకు రూ.4.70 లక్షల బిల్లు పెట్టి కాంట్రాక్టర్‌కు చెల్లించారు. తిరిగి అదే పని చేసినట్టు, మళ్లీ నిధులు వెచ్చించినట్టు చూపించి, సొమ్ములు స్వాహా చేశారు.
- ఇంకా డంపింగ్ యార్డ్‌లో చెత్త ఎగవేసేందుకు, తాగునీటి పైపులైన్లు వేసేందుకు, కోవిడ్ సమయంలో వైద్యులు, రోగులు, మృతులకు అందించిన సేవలకు బిల్లుల మీద బిల్లులు పెట్టి నిధులు నొక్కేసిన దాఖలాలున్నాయి.
- ఈ పనులు పట్టణ మహిళా సమాఖ్య (టౌన్ లెవెల్ ఫెడరేషన్) చేపట్టినట్టు రికార్డుల్లో చూపుతున్నారు. అయితే ఇంజినీరింగ్ అధికారులు ఆ సమాఖ్యను ఉపయోగించుకుని, పనులన్నీ కాంట్రాక్టర్లకు అప్పగించి పర్సంటేజీలు, ఇతర మామూళ్లతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇటీవల మున్సిపాలిటీ నుంచి ఒక డీఈఈ, ఇద్దరు ఏఈలు బదిలీ అయ్యారు. వారిలో ఇద్దరు ఇంజినీర్లు ఈ అక్రమాలకు పాల్పడ్డారని పాలకపక్ష కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వచ్చే కౌన్సిల్ సమావేశానికి వారిని తీసుకువచ్చి, తప్పుడు బిల్లులకు బదులిప్పించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కమిషనర్‌కు సూచించారు.

ఆ ఇంజినీర్లు వచ్చి లెక్కలు చెప్పాల్సిందే..



ఈ అక్రమాలకు సంబంధించి ఇటీవలే బదిలీపై వెళ్లిన ఇంజినీర్లు ఇక్కడకు వచ్చి లెక్కలు చెప్పాల్సిందే. పలు పనులకు బిల్లు మీద బిల్లు చేసుకుని కాంట్రాక్టర్లకు సొమ్ములు చెల్లించిన బాధ్యులైన ఇంజినీర్లు మున్సిపల్ కౌన్సిల్‌కు సమాధానం చెప్పాలి.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

విచారణ జరిపిస్తాను




ఈవిధంగా నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఇంత వరకూ నా దృష్టికి రాలేదు. వీటిపై కొత్తగా వచ్చిన డీఈఈ విజయదుర్గతో విచారణ జరిపిస్తాను. పనులు, బిల్లుల్లో తేడాలుంటే బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాను.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

క్లుప్తంగా

భాస్కరరెడ్డి పదవీకాలం పొడిగింపు



ద్వారంపూడి భాస్కరరెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కర రెడ్డి పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్న భాస్కర రెడ్డిని 2021 జూలై 30న రెండేళ్ల పదవీ కాలానికి రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఆ మేరకు ఈ నెల 30వ తేదీతో పదవీ కాలం ముగియనుంది. తాజా ఉత్తర్వులతో మరో ఏడాది పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు అభినందించారు.

వామ్మో.. ఎంత పెద్ద పామో!



ఆత్రేయపురం: గోదావరి వరద ప్రవాహంతో పాటు కొండ కోనల నుంచి భారీ సర్పాలు కొట్టుకుని వస్తున్నాయి. ఈ క్రమంలోనే బొబ్బర్లంక వద్ద వరద గోదావరిలో చేపలు పట్టేందుకు ఓ మత్స్యకారుడు వేసిన వలలో భారీ కొండచిలువ చిక్కుకుంది. ఏదో ఒక పెద్ద చేప చిక్కి ఉంటుందని భావించిన మత్స్యకారుడు ఆ వలను బయటకు లాగడంతో అందులో కొండచిలువ కనిపించింది. చాలా పెద్ద పాము కావడంతో ఒకింత భయంతోనే స్థానికులు దీనిని చూసేందుకు ఎగబడ్డారు. చివరకు ఆ కొండచిలువను మత్స్యకారులు తిరిగి గోదావరిలోకే విడిచిపెట్టారు.

రండి బాబూ రండి..



- విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం
- ఇంజినీరింగ్ కళాశాలల బేరసారాలు
- ఈఏపీ సెట్ కౌన్సెలింగ్‌కు ముందే హడావుడి
- సీట్లు దొరకవంటూ ప్రచారం
- ముందస్తుగా కొంత ముట్టజెప్పాలంటూ ఒత్తిళ్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ సాగుతోంది. వచ్చే నెల 3వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లకు షెడ్యూల్ ఇచ్చారు. సరిగ్గా ఇదే సమయంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు సీట్లు భర్తీ చేసుకునే పనిలో బిజీగా ఉన్నాయి. సమయం దగ్గర పడటంతో స్పీడ్ పెంచాయి. తమ కళాశాలల్లో చేరాలంటూ విద్యార్థులకు ఫోన్ల ద్వారా గాలం వేస్తున్నారు. కాస్త పేరున్న కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచీలలో సీట్లు చాలా వరకూ లేవని చెబుతున్నారు. దీంతో ఆయా కళాశాలల్లో డిమాండ్ ఉన్న బ్రాంచీలలో సీట్ల కోసం సిఫారసులు చేసుకునే పనిలో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు తలమునకలవుతున్నారు.

కోరుకున్న చోట సీటు కష్టమంటూ..

ఈఏపీ సెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుందామని వేచి చూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోవచ్చంటూ అప్పుడే ప్రచారం మొదలు పెట్టేశారు. సీటు విషయమై ఒక అంచనాకు వస్తే బాగుంటుందని, ముందస్తుగా కొంత ముట్టజెప్పి సీటు రిజర్వ్ చేసుకోవాలని కొన్ని కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. మంచి కళాశాలలో సీట్లు దొరకవనే ప్రచారంతో ర్యాంకులతో సంబంధం తల్లిదండ్రులు తమ పిల్లలకు లేకుండా సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ.. ఇలా పలు విధాలుగా సీట్లు ఖాయం చేసుకుంటున్నారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో చదువుకునే విద్యార్థులకు సంబంధించిన 15 శాతం ఎన్ఆర్ఐ కోటా సీట్లను ఇప్పటికే ఆయా కళాశాలలు భర్తీ చేసుకున్నాయని సమాచారం.

ఈ బ్రాంచిలకు డిమాండ్

రెండేళ్ల నుంచి ఐటీకి అంతర్జాతీయంగా విపరీతమైన డిమాండ్ వచ్చింది. సాఫ్ట్‌వేర్ కొలువులకు కంపెనీలు భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో సీఎస్ఈ, దానికి అనుబంధంగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచీలకు ఎక్కడ లేని డిమాండూ ఏర్పడింది. దీనిని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు బాగానే 'క్యాష్' చేసుకుంటున్నాయి. కాకినాడ జిల్లాలో బాగా పేరొందిన ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ సీటుకు రూ.10 లక్షల వరకూ కూడా డొనేషన్ ఇవ్వడానికి వెనుకాడటం లేదంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక మోస్తరు కళాశాల అయితే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఇస్తామని, సీటు రిజర్వ్ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభమయ్యాక కోరుకున్న కళాశాలలో సీటు రాకపోతే బాధ పడి ప్రయోజనం ఉండదని, ముందుగానే యాజమాన్యాలతో మాట్లాడుకుని, ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దానిని మేనేజ్‌మెంట్ లేదా ఎన్ఆర్ఐ కోటాకు మార్చుకొనే వీలు కల్పిస్తామని చెబుతూ యాజమాన్యాలు ఇప్పటి నుంచే సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో..

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు	2
సీట్లు	950
ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు	27
సీట్లు	14,770
ఏపీ ఈఏపీ సెట్ రాసిన వారు	13,744
ఉత్తీర్ణులైన వారు	12,465

- ఈ వివరాల ప్రకారం కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ఏదో ఒక ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ లభిస్తుంది.

కన్వీనర్ కోటాకే ప్రభుత్వ సహాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకే వర్తిస్తాయి. బీటెక్‌లో అన్ని బ్రాంచీలు ముఖ్యమైనవే. విద్యార్థుల ఇష్టం మేరకు ఎంచుకుని కన్వీనర్ కోటాలో చేరవచ్చు. జేఎన్‌టీయూకే పరిధిలోని 160 కళాశాలల్లో దాదాపు 30 వేల సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. ఎంసెట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థీ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి.

– డాక్టర్ సీహెచ్ సాయిబాబు,
ఏపీ ఎంసెట్ పూర్వపు కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, జేఎన్‌టీయూకే

డాక్టర్ కావాలంటే నిత్య విద్యార్థి కావాలి

ఉండ్రాజవరం: డాక్టర్ కోర్సుకావాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, ధైర్యం కావాలని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. నీట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వేలివెన్ను శశి ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటా తమ విద్యా సంస్థ నుంచి 200 మందికి తగ్గకుండా మెడికల్ సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం కూడా 300 సీట్లు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కోరుకొండ బాబ్జీ మాట్లాడుతూ, ఇంటర్ వరకూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోద్బలంతో చదువుతారని, అదే ఎంబీబీఎస్‌కు వచ్చేసరికి విద్యార్థి సొంతంగా నేర్చుకోవలసి ఉంటుందని అన్నారు.

ఎంబీబీఎస్‌లో పుస్తకాలు చదవడంతో పాటు ప్రాక్టికల్స్ చేస్తూ నిరంతర విద్యార్థిగా ఉండాలని అన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ, కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమకు నచ్చిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలను ఒకేసారి ఎంపిక చేసుకోవాలని, ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారని చెప్పారు. కౌన్సెలింగ్‌పై తల్లిదండ్రులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సాగర్ హస్పిటల్ వైద్యుడు పి.రవికిరణ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ కష్టపడి ఎంబీబీఎస్‌తో పాటు ఎండీ చేయాలని సూచించారు. శశి అకాడమిక్ డైరెక్టర్ శేషుబాబు మాట్లాడుతూ, కళాశాల విద్య వరకూ విద్యార్థుల ఒత్తిడిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు షేర్ చేసుకుంటారని, ఎంబీబీఎస్‌లో వారే చూసుకోవాలని అన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జగ్గంపేట ఏఎస్సై సుబ్బారావు కథనం ప్రకారం.. గ్రామ శివారున కాకినాడ రోడ్డులో శుక్రవారం మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం రంగు ప్యాంటు ఉన్నాయి. సుమారు ఐదడుగుల ఎత్తులో తెలుపు రంగులో ఉన్నాడు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- దేవదాయ కమిషనర్ ఆదేశం
- అన్నవరం దేవస్థానంలో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులతో సమీక్ష

అన్నవరం: సత్యదేవుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. చైర్మన్ ఐవీ రోహిత్‌తో కలిసి అన్నవరం దేవస్థానంలోని వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముఖ్యమైన పర్వదినాల్లో భారీగా వచ్చే భక్తులందరికీ సకాలంలో స్వామివారి వ్రతం, దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సత్యదేవుని ప్రసాదం విభాగాన్ని పరిశీలించి, ప్రసాదం రుచిగా తయారు చేయాలని ఆదేశించారు. గోధుమ నూక ప్రసాదం రుచి చూశారు. రామాలయం పక్కన ఉన్న కమాండ్ కంట్రోల్ రూములో దేవస్థానం పాలనా వ్యవహారాలు, నిర్మాణ సంబంధ అంశాలపై సమీక్షించారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్, తాజాగా చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆయనకు ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ వివరించారు.

ఆగమం ప్రకారమే నిర్మాణాలు

కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, దేవస్థానంలో ఏ నిర్మాణమైనా ఆగమ శాస్త్రానికి అనుగుణంగా చేపట్టాలని అన్నారు. దేవస్థానానికి త్వరలో 4 బస్సులు కొనుగోలు చేస్తున్నామని, వాటిని కొండ దిగువ నుంచి రత్నగిరికి నడుపుతామని ఈఓ తెలిపారు. న్యూ సీసీ సత్రంపై త్వరలో విద్యుద్దీపాలతో శంఖుచక్రనామాల ఏర్పాటుకు టెండర్లు ఖరారు చేశామని చెప్పారు. వివాదానికి తావు లేకుండా నామం ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వెండి, చెక్క రథాల నిర్మాణానికి కూడా అనుమతి వచ్చిందని ఈఓ తెలిపారు. రూ.1.32 కోట్లతో సీఆర్ఓ కార్యాలయం నుంచి రెండో ఘాట్ రోడ్డు రెండో మలుపు వరకూ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచే అంశాన్ని పరిశీలించి, వెంటనే అనుమతిస్తామని కమిషనర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీము కింద రూ.50 కోట్లు వచ్చే అవకాశం ఉందని, ఆ నిధులతో చేపట్టాల్సిన అన్నదానం భవనం, కొండ దిగువన డార్మెట్రీ, వ్రత మండపాలు తదితర నిర్మాణాలను దేవస్థానం నిధులతో చేపట్టవద్దని ఆదేశించారు. ప్రసాద్ నిధుల విడుదల కోసం కేంద్ర పర్యాటక శాఖ ఉన్నతాధికారులను త్వరలోనే సంప్రదించాలని ఆదేశించారు. తిరుమల మెట్ల మార్గంలో మాదిరిగా అన్నవరంలో మెట్ల దారిలో కూడా రూ.30 లక్షలతో షెల్టర్ ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచామని ఈఓ చెప్పారు.

రూఫ్ ప్యానల్స్‌తో సోలార్ విద్యుత్ ప్లాంట్

నేలపై కాకుండా వివిధ సత్రాల రూఫ్‌పై ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్వహించేందుకు సంబంధిత సంస్థలకు అవకాశం ఇస్తున్నామని కమిషనర్‌కు ఈఓ అజాద్ వివరించారు. అలాగే చెందుర్తి సమీపాన దేవస్థానానికి 159 ఎకరాల భూమి ఉందని, ఇందులో 50 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఎకరానికి రూ.30 వేల చొప్పున చెల్లించే పద్ధతిపై లీజుకు ఇస్తున్నామని వివరించారు. భూమి లీజుకు ఇచ్చేటప్పుడు యాజమాన్య హక్కులు పూర్తిగా దేవస్థానానికే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. రత్నగిరిపై 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం వచ్చే నెల 15వ తేదీకి పూర్తవుతుందని ఆ శాఖ అధికారులు చెప్పారని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్ బాబు, డీసీ విజయరాజు, అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, ట్రస్టీలు పేరూరి బద్రి, కారుకోడి పూజ, కర్రి భామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు మాస్టర్ ప్లాన్‌ను వివరిస్తున్న ఈఓ. చిత్రంలో చైర్మన్ ఐవీ రోహిత్, ఏసీ రమేష్‌బాబు



ఆయుష్య హోమం చార్జీ తగ్గింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ప్రతి నిత్యం నిర్వహిస్తున్న లక్ష్మీప్రయుక్త ఆయుష్య హోమం టికెట్‌ను రూ.2 వేల నుంచి రూ.వెయ్యికి తగ్గించాలని అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ తీర్మానించింది. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో సభ్యులతో పాటు ఈఓ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు. **ముఖ్య తీర్మానాలివీ..**

- ప్రతి గురువారం సత్యదేవుని నిజరూప దర్శనం.
- స్వామి, అమ్మవారు, శివునికి ప్రతి సోమవారం ముత్యాల కవచాలంకరణతో ముత్తంగి సేవకు రూ.9 లక్షలతో ముత్యాల కవచాల తయారీ.
- ప్రదక్షిణ దర్శనం టికెట్ రూ.200 నుంచి రూ.300కు పెంపు.
- సత్యదేవునికి వెండి రథం తయారీకి 3 శాతం తక్కువగా రూ.33 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం.
- 36 అడుగుల ఎత్తున టేకు రథం తయారీకి 2.96 శాతం తక్కువగా రూ.64.29 లక్షలకు దాఖలైన టెండర్‌కు ఆమోదం. ఈ రథం రక్షణకు కొండ దిగువన రూ.40 లక్షలతో షెడ్డు వేయడానికి టెండర్లు పిలవాలి.
- రూ.1.45 కోట్లతో సీఆర్ఓ కార్యాలయం నుంచి మూడో ఘాట్ రోడ్డుకు కచ్చా రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవాలని నిర్ణయం.
- 30 వీఐపీ సత్రం, క్యాంటీన్‌కు ఎదురుగా ఉన్న పీజీహెచ్ సత్రాలను కూల్చి, వాటిలో మెటీరియల్ తీసుకుని, ఆ స్థలం చదును చేసి ఇచ్చేందుకు టెండర్లు పిలవాలి.
- రత్నగిరి మెట్ల మార్గంలో రూ.40 లక్షలతో ప్రొఫైల్ షీట్ షెడ్డు నిర్మాణానికి అంగీకారం.
- ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్ద రూ.90 లక్షలతో ప్రొఫైల్ షెడ్ నిర్మాణానికి టెండర్ పిలవాలని నిర్ణయం. ఇంకా పలు తీర్మానాలకు ఆమోదం.

ముగిసిన నవోదయ క్లస్టర్ పోటీలు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి బాల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం, గండేపల్లి ఎంఈఓలు ఇ.ప్రభాకరశర్మ, రామకృష్ణారెడ్డి, కేవీ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని, తద్వారా విజయావకాశాలు పెంపొందించుకోవాలని అన్నారు. క్లస్టర్ లెవెల్ బాల్ గేమ్స్‌లో (వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్) నవోదయ తూర్పు గోదావరి 1, 2తో పాటు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ విద్యాలయాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రీజినల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ సత్యనారాయణ తెలిపారు. రీజినల్ లెవెల్‌కు విజయనగరం, కేరళలోని కాసర్‌గోడ్, కర్ణాటకలోని హావేరి నవోదయ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు.

గంజాయి కేసులలో ఆరుగురి అరెస్టు

రావులపాలెం: రెండు వేర్వేరు గంజాయి కేసులలో రావులపాలెం పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 2.20 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై ఎం.వెంకట రమణ శుక్రవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. స్థానిక అమలాపురం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరిని అనుమానంతో ప్రశ్నించారు. వారిని అల్లూరు సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కొంతగూడ గ్రామానికి చెందిన వంతల కృపారావు, మలికిపురం మండలం గూడపల్లికి చెందిన యేడిద వీర నాగేంద్ర సాకేత్‌గా గుర్తించారు. వీరిద్దరూ కలసి గంజాయి తరలిస్తున్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో రావులపాలెం మండలం పొడగట్లపల్లి శివారు లక్ష్మీపాలెం ఐస్ ఫ్యాక్టరీ ఎదురుగా గంజాయి తాగుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. కాలువ అవతల పొడగట్లపల్లి వెళ్లే దారిలోని ఖాళీ ప్రదేశంలో వీరు గంజాయి తాగుతున్నట్టు అందిన సమాచారంతో దాడి చేశారు. వీరిని నెల్లి శశాంక సిన్హా (రాజమహేంద్రవరం), వెంట్రపాటి అనిల్ కుమార్ (లక్ష్మీపాలెం), పెరవలి బాలసాయి (రావులపాలెం), బండి మనోహర్ దొరై(పొడగట్లపల్లి)గా గుర్తించారు. ఒక్కొక్కరి వద్ద 5 గ్రాముల చొప్పున మొత్తం 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిలో బాలసాయి, మనోహర్ దొరైలు గతంలో గంజాయి దాడుల్లో పట్టుబడ్డారని, వీరు గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నట్టు గుర్తించామని సీఐ, ఎస్సై తెలిపారు.

అమరావతిలో పేదల స్థలాలను అడ్డుకున్న చంద్రబాబు

మంత్రి జోగి రమేష్

సాక్షి, అమలాపురం: 'అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందంటూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అదే సుప్రీంకోర్టును ఆశ్రయించి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనార్టీలకు స్థలాలు ఇప్పించారు. స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటిన తరువాత కూడా మనం అంటరానివారమా? ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు చూస్తే ఇలానే అనిపిస్తోంది.' అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ అన్నారు. అమలాపురంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి రమేష్ నిప్పులు చెరిగారు. 'పెత్తందార్ల పక్కన నివసించే అర్హత మనకు లేదా?' అని ప్రశ్నించారు. సీఎం జగన్ మన పక్షాన నిలిచి పేదలను గెలిపించారన్నారు. 50 వేల మందికి ఇళ్లు కట్టించి ఇస్తున్నారని చెప్పారు. బాబు, పవన్ హైదరాబాద్‌లో ఉంటూ రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ సింహం అని, యుద్ధానికి సింగిల్‌గానే వస్తారని చెప్పారు. 2019లో గెలిచిన చరిత్రను తిరగరాస్తామని, గత ఎన్నికల్లో వచ్చిన 151 సీట్ల కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌కు రూ.100 చొప్పున రాయితీ ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఇవ్వలేదని గుర్తు చేశారు. ఏడాదికి రూ.1,200 చొప్పున ఐదేళ్ల పాలనలో ఒక్కో మహిళకు రూ.6 వేలు బకాయి పెట్టాడని చెప్పారు. టీడీపీ నాయకులు ఇంటికి వస్తే మహిళలు గ్యాస్ బండ్‌తో ఒక్కటి వేయాలని పిలుపునిచ్చారు. అమరావతిలో లక్షల కోట్లు ఖర్చు పెడితే అమలాపురానికి, ఇక్కడి రైతులకు ప్రయోజనమేమిటని మంత్రి రమేష్ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.